




మన భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

ఆదివారం 9 ఆగస్టు 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 3







# ఆగస్టు 10 నుండి రైతులతో మాట పంట మార్పిడి బాట







భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు తగినంతగా కురిసే అవకాశం రోజురోజుకు సన్నగిల్లడంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని, తప్పని పరిస్థితుల్లో జిల్లాలోని రైతులు వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ చెప్పారు. శనివారం సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఇరిగేషన్ ఆర్టికల్చర్, ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు వివిధ శాఖలతో అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎల్ నినో ప్రభావం పంట మార్పిడి అవగాహన సదస్సును తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ ఇండియా మెట్రోలాజికల్ డిపార్ట్మెంట్ (ఐఎండి) సూచనల ప్రకారం వర్షాకాలం సీజన్లో ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు తక్కువగా ఉంటాయన్న విషయాన్ని గ్రహించి వ్యవసాయ శాఖ రైతులకు వరికి బదులుగా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు వేయాలని వివరంగా చెప్పడం జరిగిందని, ఈసారి వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉందని, నాగార్జున సాగర్ లో ప్రస్తుతం నీటిమట్టం 312 టీఎంసీ లకు గాను 137 టీఎంసీలు మాత్రమే నీటి నిల్వ ఉన్నాయని, ఎస్ ఆర్ ఎస్ పి లో కూడా తగినంత నీరు నిల్వలేదని ఇవి రెండు డెడ్ స్టోరేజ్ లో ఉన్నందువలన తాగునీటికి మాత్రమే నీరు సరిపోతాయని అందువలన రైతులు ఆరుతడి పంటలు వేస్తే సాగు ఆశాజనకంగా ఉంటుందని. భూగర్భ జలాలు నానాటికి తగ్గిపోవడం అనేది కొంచెం ఆందోళన కలిగించే విషయం అని తెల్పి చెప్పారు. జిల్లాలో ఉన్న నీటి లభ్యతను పరిగణలోనికి తీసుకుని త్రాగునీటికి ఎక్కువ ప్రాధాన్యత ప్రస్తుతం ఇవ్వడం జరుగు తుంద న్నారు. వరి సాగుకు ఎక్కువ నీటి లభ్యత అవసరం అవుతుందని, ఆరుతడి పంటలకు నీటి అవసరం తక్కువ ఉంటుందని వివరించారు. జిల్లాలోని ప్రాజెక్టుల్లో నీటి లభ్యత కూడా కేవలం త్రాగునీటికే సరి పోతుందని, సాగునీటికి తీవ్ర కొరత ఉందని కలెక్టర్ తేజస్ వెల్లడించారు. జిల్లాలో 1071 చెరువులలో నీరు తక్కువగా ఉందని, 54 ఐడిసి లిఫ్టులు నడిచే పరిస్థితి లేదని చెప్పారు. ఒక ఎకరా వరికి 44 నుంచి 55 లక్షల లీటర్ల నీరు అవసరం ఉంటుందని, పత్తికి 24 నుంచి 28 లక్షల లీటర్ల నీరు అవసరం ఉంటుందని, కందులు, పెస లు, మినుములకు 11 నుండి 14 లక్షల లీటర్ల నీరు మాత్రమే అవసరం ఉంటుందని, జొన్న, సజ్జలు, బొబ్బర్లు, అలసందలు, మొక్కజొన్న, వేరుశనగ, రాగులు, కొర్రలు, అండు కొర్రలు, నువ్వులకు కూడా నీటి అవసరం తక్కువగా ఉంటుందని, చిరుధాన్యాల వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు. వర్షాలు ఆలస్యం అవుతు న్నందున తక్కువ సమయంలో పంటలు పండే రకాల విత్తనాలన్నీ లభ్యమవు తున్నాయని, పంట మార్పిడి వలన భూసారం కూడా పెరుగు తుందని వివరించారు. ఆగస్టు, సెప్టెంబర్ లో కూడ వర్షాలు ఇదే పరిస్థితి లో ఉంటాయని ఐఎండి శాస్త్రవేత్తలు సూచించినందున తక్కువ నీటిని తీసుకొని అతి తక్కువ సమయంలో పంటలు పండే చిరుధాన్యాల రకాలను కొనుగోలు చేసి తక్కువ సమయంలో పంట చేతికి వచ్చేలా సాగు అవలంబించవచ్చని తెలిపారు. ప్రభుత్వం దగ్గర రైతులకు కావలసిన విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని రైతులు ప్రభుత్వం పంపిణీ కేంద్రాల వద్ద పంపిణీకి సిద్ధంగా ఉన్న విషయాన్ని రైతులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

**ఆగస్టు 10 నుంచి జిల్లాలో రైతులతో మాట- పంట మార్పిడికి బాట 10 రోజుల పంట మార్పిడి పథకం స్పెషల్ డ్రైవ్**




ఆగస్టు 10వ తేదీ నుంచి సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులను ప్రోత్సహించే విధంగా రైతులతో మాట - పంట మార్పిడి బాట, ఆరుతడి- మేలైన వ్యవ సాయ సాగుబడి తదితర నినాదాలతో పది రోజులపాటు ఒక్కొక్క అధికారి పదిమంది రైతులను ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపేలాగా ప్రోత్సహించే కార్యక్రమాలను చేపడుతున్నట్లు కలెక్టర్ చెప్పారు. ప్రకృతి లో ఏర్పడ్డ మార్పుల కారణంగా జరుగుతున్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను అర్థం చేసుకొని ప్రభుత్వానికి సహకరించి ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు సూచించిన విధంగా వ్యవసాయం సాగు చేయాలని, ఆరుతడి పంటలు వేసి రైతులు లాభాలు అర్జించాలని, నీటి లభ్యత లేని కారణంగా వరి పండే పరిస్థితి లేదని తెల్చి చెప్పారు. రైతులందరూ ఈ విషయంలో ప్రభుత్వానికి సహకరించాలని, తద్వారా వ్యవసాయంలో ఆర్థిక నష్టాన్ని తగ్గించుకుని లాభాలు వచ్చే దిశగా రైతన్నలు ఆరుతడి పంటలు వేసి వ్యవసాయ సాగులో ముందుకు పయనించాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. సరిపడా నీటి లభ్యత ఉండటం లేదన్న విషయాన్ని రైతులందరూ గమనించుకొని తదనుగుణంగా పంట మార్పిడి చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు సూచిస్తున్న విధంగా రైతులు స్పందించి ఆరుతడి పంటలు సాగు చేసి వ్యవసాయం దండగ కాదు పండగ అనే విధంగా మంచి లాభాలు ఆరుతడి పంటల ద్వారా సాధించాలని కలెక్టర్ తేజస్ ఆకాంక్షించారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల శామ్యూల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు కనిపిస్తున్నా ప్రజలెవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని. వర్షా భావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, సాగునీటి కష్టాల నుంచి గట్టెక్కేందుకు సాగర్‌లో వరుణ యాగం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ ఈనెల 10వ తేదీన నాగార్జున సాగర్ లో “వరుణ యాగం” నిర్వహి స్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపా ఈ క్రతువులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, గ్రంధాలయ చైర్మన్ వంగ వీటి రామారావు హుజూర్నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక, తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ చామంతి నరేష్,ఆర్డీవోలు శ్రీనివాసులు, వేణు మాధవ్ ఇరిగేషన్ సి ఇ నాగభూషణం, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, జడ్పీ సీఈవో శిరీష, డిఆర్డిఏ పిడి సన్యాసయ్య, డిపిఓ యాదగిరి, జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న ఆశయాలను భావితరాలకు అందించాలి

**-ట్యాంక్‌బండ్‌పై సాయన్న విగ్రహం ఏర్పాటు చేయాలి**

**-బీసీ జేఏసీ కన్వీనర్ బద్రబోయిన సైదులు**



భానుపురి /సూర్యాపేట టౌన్

పీడిత, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పోరాడిన తెలంగాణ బంధువు పండుగ సాయన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని బీసీ జేఏసీ కన్వీనర్ బద్రబోయిన సైదులు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద పండుగ సాయన్న జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల లేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో జన్మించి అణగారిన ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన పండుగ సాయన్న జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు.ఆనాడే పెత్తందారులను ఎదిరించి పేద, బడుగు బలహీన వర్గాలకు విముక్తి కల్పించేందుకు పండుగ సాయన్న పోరాటం చేశారని తెలిపారు. ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పించి, సామాజికంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు.రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గంతో పాటు బడుగు బలహీన వర్గాలకు చెందిన మహనీయుల చరిత్రను ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పండుగ సాయన్న వంటి మహనీయుల జీవిత చరిత్రలను అధికారికంగా నమోదు చేసి భావితరాలకు అందించాలని కోరారు.తక్షణమే ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని పాఠ్యపుస్తకాల్లో పండుగ సాయన్న జీవిత చరిత్రను చేర్చి, ఆయన పోరాట స్ఫూర్తిని విద్యార్థులకు, భావితరాలకు పరిచయం చేయాలని కోరారు.పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన ఆశయాలు, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలను రేపటి తరానికి అందించేందుకు బీసీ జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు బైరోజు మదనాచారి బీసీ చేసిన నాయకులు కూరాకుల శ్యాంసుందర్ కక్కిరేణి నాగేంద్రబాబు ముత్యం నాగేంద్రబాబు యోగి వీరు నరేష్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# ఆగస్టు 10న జరిగే జైల్ బరో జయప్రదంచేయండి

భానుపురి /సూర్యాపేట టౌన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జరిగే జైల్ బరోను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 10న జరిగే జైల్ బరోను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జిపు యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సుమారుగా 24 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయని అంత్యోదయ కార్డులు రెండు కోట్ల 25 లక్షలు, మొత్తం లబ్ధిదారులు 80 కోట్ల మంది ఉన్నారని, తెలంగాణలో సుమారుగా కోటి కార్డులు. మూడు కోట్ల 25 వేల మంది లబ్ధిదారులు ఉన్నారని, అయితే తెలంగాణ ప్రభుత్వం బియ్యం తప్ప ఏ నిత్యవసర వస్తువులు అందించడం లేదన్నారు, 16 రకాల వస్తువులు ఇవ్వాలని తెలిపారు కేంద్ర ప్రభుత్వం సామ్రాజ్యవాద శక్తులకు లొంగిపోయి అమెరికా నుండి మక్కజొన్న పత్తి. చేపలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను జీరో టార్క్ తో దిగుమతి చేసుకోవడానికి అంగీకరించడం దేశ రైతాంగ కార్మిక వర్గం వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని విమర్శించారు, కార్మికులు దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లు తీసుకురావడం కార్మికుల హక్కులపై దాడి అని అన్నారు 2005లో గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తూ వి బి జి రాంజీ పేరుతో కేంద్రం కొత్త పథకాన్ని తీసుకురావడం గ్రామీణ పేదల జీవనోదిపై దెబ్బ అని విమర్శించారు రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి అనుకూలంగా వ్యవహరిస్తూ విద్యుత్ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తుందని, రైతు డిస్కౌంట్ బిల్లును అమలు చేయడానికి మూడవ డిస్కౌంట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని వేద విధిగా కొనసాగించాలి, ఈ బిజీ రాంజీ బిల్లును రద్దు చేయాలి లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని కోరుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు




వ్యతిరేకంగా ఆగస్టు 10న జరిగే జైల్ బరో కార్యక్రమాలకు కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోసిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్గూరి గోవింద్, ప్రజా సంఘాల నాయకులు బొమ్మిడి లక్ష్మీనారాయణ, వజ్జా శ్రీనివాస్, చెరుకు సత్యం, శివకృష్ణ, బత్తిని సైదులు, భూపాల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యంగా ఉందాం..ఉద్యోగ భద్రత సాధించుకుందాం

భానుపురి /సూర్యాపేట టౌన్

ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత అనేది దశాబ్దాల కల. ఆ కల కలగానే మిగిలిపోతుందేమో అనే ఆందోళనతో ఉద్యోగాలు చేస్తూ వస్తున్నామని చేయని తప్పుకు కూడా వందల మంది బలవుతూ "మహాలక్ష్మి" పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలు కోల్పోయే క్రమం పెరిగిందని వీటన్నింటికి చెక్ పెట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు కోరుకుంటున్నారని స్టాఫ్ ఉవర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్ అన్నారు. 2019లో 55 రోజుల చారిత్రాత్మక సమ్మె నేపథ్యంలో 2019 డిసెంబర్ నుంచి ఆర్టీసీ కార్మికులపై ప్రభుత్వం ఆంక్షలు విధించిందని కార్మిక సంఘాలను అనుమతించలేదని కనీసం వినతిపత్రాలను కూడా తీసుకోలేదని గత 7 సంవత్సరాలుగా ఒకవైపు ఆంక్షలు, మరోవైపు పని భారాలు పెరుగుతూ వచ్చాయని ఆర్టీసీ కార్మికులకు వ్యతిరేకంగా గత ప్రభుత్వం 2021 ఫిబ్రవరి 5న "ఉద్యోగ భద్రత మార్గదర్శకాలను" విడుదల చేస్తే ఆ మార్గదర్శకాల్లోని నష్టాలను, లోపాలను బయటపెట్టిన సంఘం ఎస్ డబ్ల్యు ఎఫ్ నే అని అన్నారు.2021 ఫిబ్రవరి 20న రాష్ట్ర సదస్సు నిర్వహించగా యూనియన్లకు అతీతంగా 500 మంది హాజరయ్యారు. ఫిబ్రవరి 27న 40 డిపోలలో కార్మిక బ్యాలెట్ నిర్వహించగా 7,000 మందికి పైగా పాల్గొని 2021 మార్గదర్శకాలను రద్దు చేసి, సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ అన్ని కార్మిక సంఘాలు 2026 ఏప్రిల్ 22--24 మధ్య సమ్మె చేశాయి. సమ్మె విరమింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో 7 సంవత్సరాల్లో మొదటిసారి అన్ని కార్మిక సంఘాలతో చర్చలు జరిగాయని ఆర్టీసీ విలీనం, సంఘాలను అనుమ తించడం, 2021 పే స్కేల్ ను 11% ఫిట్‌మెంట్‌తో అమలు చేయడం, ఆర్టీసీ పరిధిలోని సమస్యలను యాజమాన్యం చర్చించి పరిష్కరించడం వంటి హామీలు ప్రభుత్వం ఇచ్చింది. దీంతో సమ్మె విరమిం చామన్నారు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కమిటీతో మే 21, జూన్ 12, జూన్ 20 తేదీలలో అన్ని కార్మిక సంఘాలతో చర్చలు జరి గాయి. చర్చల్లో 17 అంశాలపై చర్చ జరిగి ందని ఉద్యోగ భద్రతపై కూడా ప్రత్యేకంగా చర్చిం చాలని కోరిందన్నారు .మహాలక్ష్మి పథకం అంశంలోనే ఉద్యోగ భద్రతను కూడా చేర్చి చర్చి ద్దామని అధికారుల కమిటీ అంగీ కరించిందని



.జూన్ 20న జరిగిన చర్చల్లో ఆర్టీసీ రెగ్యులేషన్స్ చట్టానికి వ్యతిరేకంగా ఉన్న అంశాలను పూర్తి ఆధారాలతో రుజువు చేసిందని అనంతరం ఉద్యోగ భద్రతపై గైడ్‌లైన్స్ రూపొందించేందుకు మరో కమిటీని ఏర్పాటు చేస్తామని ఈడి కమిటీ తెలిపిందన్నారు. కానీ నెల రోజులు గడిచినా కమిటీ ఏర్పాటు కాలేదని అంగీకరించిన అంశాలను అమలు చేయాలని నాయ కత్వం కమిటీ కన్వీనర్, చైర్మన్, ఆర్టీసీ వి సి ఎం డి లను కలిసి విన్నవించిమని రాష్ట్ర రవాణా శాఖ మం త్రిని కూడా కలిసి సమస్యను వివరించ మన్నారు. జూలై 27న ధర్నాలు నిర్వహించి వినతి పత్రాలు సమ ర్పించిన నేపథ్యంలో చివరకు ఈ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. అలవెన్సుల 80% పెంపు, టెస్ట్ పాసైన వారికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇవ్వడం, బ్రెడ్ విన్నర్ స్కీంలో వారిని రెగ్యులర్ చేయడం తదితర అంశాలను 2026 ఆగస్టు 12న జరిగే బోర్డు సమావేశంలో చర్చించి అమలు చేస్తారని ఆశిస్తున్నా మన్నారు . ఆర్టీసీ రెగ్యులేషన్స్‌లో అవసరమై న సవర ణలు చేయకుండా ఉద్యోగ భద్రత సాధ్యం కాదని కార్మికులు అర్థం చేసుకున్నారని ప్రస్తుతం అన్ని కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపడం వల్ల మొదటి సారి అన్ని యూనియన్లు ఉమ్మడిగా యాజమాన్యం, ప్రభుత్వంతో ఉద్యోగ భద్రత సమస్యపై చర్చించే అవకాశం వచ్చిందన్నారు. జూన్ 20న జరిగిన చర్చల సందర్భంగా క్రింది అంశాలను అన్ని యూనియన్ల రిప్రజెంటేషన్‌లో ఉండేలా చూడాలని అన్ని సంఘా లకు లేఖలు ఇచ్చామన్నారు మోటారు వాహన చట్టం--2019లోని సెక్షన్ 124ను ఖచ్చితంగా అమలు చేయాలి. 2019లోని సెక్షన్ 178, 178(2)లను ఖచ్చితంగా అమలు చేయాలి. 2019లోని సెక్షన్ 178(2)కు అనుగుణంగా ఆర్టీసీ రెగ్యులేషన్‌లోని సంబంధిత నిబంధనలను సవరిం చాలి. డిపో స్పేర్ విధానాన్ని ఎత్తివేయాలి. ఆర్టీసీ కార్మికోద్యమ చరిత్రలో మొదటి సారి వచ్చిన ఈ అవకాశాన్ని అన్ని కార్మిక సంఘాలు సరైన విధంగా ఉపయోగించుకోవాలి. సరైన ఉద్యోగ భద్రత సాధిం చుకునేలా ఆర్టీసీలోని అన్ని సంఘాలు, కార్మికులు ఐక్యంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తోందన్నారు . డిపో కార్యదర్శి ఉప్పు. లక్ష్మయ్య మాట్లాడుతూ అంగీ కరించిన అన్ని అంశాలను ఆగస్టు 12న జరిగే బోర్డు సమావేశంలో ఆమోదింపజేసి అమలులోకి తేవాలని యాజమాన్యాన్ని కోరుతున్నారని చర్చల వివరాలతో కూడిన "ప్రొసీడింగ్స్"ను అన్ని కార్మిక సంఘాలకు తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు . నష్టంలేని విలీనంతో సహా అంగీకరించిన అన్ని అంశాలు అమలు చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజు, ఉపాధ్యక్షులు ఇంద్రయ్య, యల్లయ్య, కోశాధికారి శ్రీకాంట్లం, సంధ్య, సువర్ణ, అయోధ్య, వెంకన్న, నర్సింహా, రాము, ఖలీల్, స్వాతి, సరిత,రవి, తదితరులు పాల్గొన్నారు

# ఇందిరా మహిళా శక్తి భవనం పనులను వేగవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




భానుపురి/సూర్యాపేట ప్రతినిధి:

జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ భవనం అందుబాటులోకి వస్తే మహిళా సంఘాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. భవనానికి సంబంధించి మిగిలి ఉన్న బ్యాలెన్స్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి, పెయింటింగ్ మరియు ఫినిషింగ్ పనుల్లో ఎక్కడా జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను, సంబంధిత శాఖా అధికారులను ఆదేశించారు. భవనం ప్రారంభమైతే జిల్లాలోని మహిళా సంఘాల కార్యకలాపాలకు, శిక్షణ కార్యక్రమాలకు వేదికగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో డిఆర్డిఓ సన్యాసయ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్ఐ గా పదోన్నతి పొందిన వంకాయల రమాదేవికి సన్మానం



భానుపురి /తిరుమలాయపాలెం:

తిరుమలాయపాలెం మండల హెడ్ కోటర్ లో కానిస్టేబుల్ గా హెడ్ కానిస్టేబుల్ గా అనేక సేవలందించి,ప్రజలలో రక్షణ కవచంగా మన్ననలు పొందిన వంకాయల రమాదేవి కు ఏఎస్ఐగా పదోన్నతి రావటం హర్షనీయమని శనివారం తిరుమలాయపాలెం మండల సిపిఎం పార్టీ కార్యదర్శి కొమ్ము శ్రీను హర్ష వ్యక్తం చేశారు ఉద్యోగ నిర్వహణలో కష్టపడి అనేక పేదరికంలో పుట్టి పట్టుదలతో కష్టపడి చదివి ఈ స్థాయికి రావటం గొప్ప విషయమని ఆయన కొనియాడారు ఈ యొక్క కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజేష్ రాథోడ్,తుళ్లూరు నాగేశ్వరరావు కొమ్ము నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు,

# రైల్వే సాధన ఉద్యమానికి సహకరించండి

-ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి రైల్వే సాధన సమితి విజ్ఞప్తి

భానుపురి/సూర్యాపేట

సూర్యాపేటకు రైల్వే సౌకర్యం సాధించేందుకు చేపడుతున్న ఉద్యమానికి మద్దతు, సహకారం అందించాలని సూర్యాపేట రైల్వే సాధన సమితి నాయకులు సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కోరారు. రైల్వే సాధన సమితి కమిటీ సభ్యులు శనివారం జగదీశ్‌రెడ్డిని కలిసి ఉద్యమ లక్ష్యాలను వివరించారు. సూర్యాపేట ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన రైల్వే సౌకర్యం సాధన కోసం అన్ని వర్గాలను కలుపుకొని పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. రైల్వే సాధనకు అవసరమైన సహకారం అందించాలని కోరిన సమితి నాయకులు, ఈ ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా ప్రజా ఉద్యమంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైల్వే సాధన కోసం చేపట్టే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి కన్వీనర్ దేగల జనార్ధన్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె. రంగారెడ్డి, గౌరవ సలహాదారు లింగంపల్లి భద్రయ్య, కో కన్వీనర్లు రాచూరి ప్రతాప్, డాక్టర్ రమేష్ చంద్ర, కన్వీనింగ్ కమిటీ సభ్యులు అక్కెనపల్లి రాము, నల్లవాటి అప్పారావు, భవాని విద్యాసంస్థల అధినేత మతకాల చలపతిరావు, గౌరవ సలహాదారు న్యాయవాది అయోధ్య, న్యాయవాది సవేంద్ర కుమార్, కొంపల్లి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలి



-టీబీ నిర్ధారణ పరీక్షలు, చిన్నారుల టీకా కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న

భానుపురి ఆగస్టు 08,సూర్యాపేట :

టీబీ రహిత తెలంగాణ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణం లోని 9వ వార్డులోని పాత ఫైర్ స్టేషన్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన టీబీ నిర్ధారణ పరీక్షలు, చిన్నారుల నెలవారీ టీకా కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న పాల్గొన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి కార్యక్రమాన్ని పరిశీలించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నిర్ధారణ పరీక్షలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. వ్యాధి లక్షణా లు ఉన్న వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపా రు. వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను క్రమం తప్పకుండా వాడుతూ టీబీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అదేవిధంగా చిన్నారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను ప్రతి తల్లిదండ్రులు సకాలంలో వేయించాలని సూచించారు. నిర్ణీత సమయంలో టీకాలు వేయించడం ద్వారా పిల్లలను పలు వ్యాధుల నుంచి రక్షించవచ్చని తెలిపారు. టీకాలు పిల్లల హక్కు కాగా, వాటిని సకాలంలో వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు. వార్డులోని ప్రతి కుటుంబం ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, టీకాలను సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్య శాఖతో కలిసి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్ర మంలో క్యాంపు ఇంచార్జి ఉపేంద్ర, ఏఎన్ఎం వెంకట రమణ, ఆశా కార్యకర్త గంగ, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, విమలమ్మ, వార్డు నాయకులు ఈదుల జానయ్య,వైద్య ఆరోగ్య సిబ్బంది, తల్లిదండ్రులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ అభయహస్తం అమలుకై ఉద్యమిద్దాం

-చలో కోదాడ బహిరంగ సభను విజయవంతం చేద్దాం

-సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పల్లెటి లక్ష్మణ్ మాదిగ, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు మాదిగ



భానుపురి ఆగస్టు 08,సూర్యాపేట :

అంబేద్కర్ అభయహస్తం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న కోదాడలో ఏమ్మార్పిస్ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిం చనున్నట్లు పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పల్లెటి లక్ష్మణ్ మాదిగ, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబు మాదిగ ఆధ్వర్యంలో బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. . మధ్యాహ్నం ఒంటి గంటకు పురపాలక సంఘం ప్రాంగణంలో సభ జరుగుతుందని పేర్కొన్నారు. సభకు మాదిగలు, దళితులు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు తరలిరావాలని పిలుపునిచ్చారు.గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు పోరాడారని, వర్గీకరణ సాధించినప్పటికీ దళితుల సంక్షేమానికి సంబంధించిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేసి దళిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, భూమిలేని ఎస్సీ కుటుంబాలకు భూమి, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పాటు దళితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే దళితుల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. బహిరంగ సభను విజయవంతం చేసేందుకు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలుతరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు కనుకు జానయ్య మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి విజయభాస్కర్ మాదిగ, రాష్ట్ర కార్యదర్శులు మిద్దె వెంకటయ్య, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వంగాల వెంకన్న మాదిగ, కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బచ్చలకూరి నాగరాజు మాదిగ, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పాల్వాయి సూరయ్య మాదిగ, జిల్లా నాయకులు మొండికత్తి లింగయ్య మాదిగ, కందుకూరు నాగేశ్వర రావు మాదిగ, ఉప్పల వినోద్ మాదిగ, నారకట్ల ప్రసాద్ మాదిగ, పంది ఏసు మాదిగ తదితరులు పాల్గొన్నారు.